క్లుప్తంగా

పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: ఆదోని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, మహిళా నాయకురాళ్లు అధైర్యపడకుండా ఉండాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోపాల్‌రెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంతమంది స్వార్థపరులు ప్రలోభాలకు ఆశపడి పార్టీని వీడుతున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆదోని నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకు, ప్రజలకు ఎవరికి అన్యాయం జరిగినా మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అండగా ఉంటారని చెప్పారు. కూటమి నాయకుల ఆగడాలను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

బడుగుల హక్కుల సాధనకు పోరాటం



రామచంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: బడుగు, బలహీన వర్గాలు, శ్రామిక వర్గాల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకుడు ఆర్.రామచంద్ర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగన్న మాట్లాడుతూ.. రామచంద్ర పార్టీకి, పేదలకు అందించిన సేవలను కొనియాడారు. సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, సమీవుల్లా, బజారి, హనుమంతు, విరుపాక్షినాయుడు, జబ్బార్, తిమ్మగురుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, ఖాజ, కృష్ణ, సురేంద్ర, రఘు, విజయ్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంఈఓ-1 ఆంజనేయులుకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అడ్మిషన్ ఫీజులు, డొనేషన్లు వసూలు చేయడమే గాకుండా ప్రవేశాలు కల్పించేందుకు పరీక్షలు పెట్టడం దారుణమన్నారు. పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లను పాఠశాలల్లో విక్రయిస్తూ కొత్త వ్యాపారం మొదలెట్టారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.


ఘనంగా అర్లయ్య స్వామి రథోత్సవం



రథోత్సవంలో కలశాలతో చిన్నారులు, మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలోని అర్లయ్య వీధిలో వెలిసిన అర్లయ్య స్వామి రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు, వీధి పెద్దల ఆధ్వర్యంలో వేకువజాము నుంచి అర్లయ్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం అర్లయ్య స్వామి రథోత్సవం నిర్వహించారు. చిన్నారులు కలశాలతో ముందుకు సాగారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి చేతులమీదుగా రథాన్ని లాగారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రాముడు

కోడుమూరు రూరల్: రోడ్డుపై నిల్చున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి కోడుమూరులో చోటు చేసుకుంది. వివరాలు.. కోడుమూరుకు చెందిన రాముడు మంగళవారం రాత్రి పట్టణంలోని కర్నూలు మార్గంలోని రామాలయం వద్ద రోడ్డుపై మరో వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో కర్నూలు వైపు నుంచి వేగంగా వచ్చిన ఐచర్ లారీ అతన్ని ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి రాముడు 10 అడుగుల దూరం ఎగిరిపడ్డాడు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన చుట్టుపక్కల వారు రాముడును సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిద్దాం

- తాత్కాలిక ఉపశమనం కోసం వెంపర్లాడితే భవిష్యత్ అంధకారం
- ఆదోనిలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం
- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామని ప్రతిజ్ఞ చేస్తున్న సబ్‌కలెక్టర్, ట్రైనీ డీఎస్పీ, అధికారులు



సోమప్ప సర్కిల్‌లో మానవహారంగా నిలబడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఆదోనిలో ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు



ఎమ్మిగనూరులో ర్యాలీలో పాల్గొన్న సీఐలు, ఎస్‌ఐలు, విద్యార్థులు



కోసిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న సెబ్ సీఐ మహబూబ్ బాషా, విద్యార్థులు



కౌతాళంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి



గోనెగండ్ల జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ రామకృష్ణయ్య

ఆదోని రూరల్: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సిల్వర్‌జూబ్లీ హాల్‌లో సెబ్, లా అండ్ ఆర్డర్ పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. తాత్కాలిక ఉపశమనం కోసం భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదని విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాలు, వాటిని అక్రమంగా రవాణా చేయడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చిక్కులపై అవగాహన కల్పించారు. గంజాయి తీసుకునే వారిలో అందులోని టెట్రాహైడ్రోకెనబినాయిడ్ అనే రసాయనం బానిసలుగా మారుస్తుందన్నారు. పిల్లలంటేనే ఉత్సాహానికి సంకేతం, వారు ఎలాంటి సాహసాలకైనా వెనుకడుగు వేయరు. కొత్త ప్రయోగాలను కోరుకుంటారు, ఈ క్రమంలోనే గంజాయి, డ్రగ్స్ వంటివాటికి సరదాగా మొదలపెట్టి తర్వాత వాటిని వదులుకోలేక బానిసలుగా మారుతారన్నారు. మత్తు పదార్థాలు సేవిస్తే మెదడులో డోపమైన్, సెరటోనిన్ అనే ఉత్ప్రేరకాలు విడుదలవుతాయని, వాటివల్ల ఉత్తేజంగా ఉన్నట్టు అనిపిస్తుందని, అందుకే వాటిని మళ్లీ మళ్లీ కోరుకుంటారన్నారు. ఈ క్రమంలోనే వాటికి బానిసలవుతారని చెప్పారు. దానివల్ల శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. మెదడుపై తీవ్ర ప్రభావం చూపి శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తిని దెబ్బతీస్తుందని, చురుకుదనం సన్నగిల్లుతుందన్నారు. గంజాయి సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తాయని, అలాగూ ప్రమాదాలను గూర్చి సబ్‌కలెక్టర్ విద్యార్థులకు ఉపదేశించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారు ఎవరైనా ఉంటే తమకు సమాచారం అందిచాలని, అలాంటి వారిని డీఅడిక్షన్ కేంద్రాలకు పంపి డ్రగ్స్ నుంచి బయటపడేలా కృషి చేస్తామన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయం, వినియోగం జరుగుతున్నట్లయితే సమాచారం తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థులచే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించి జిమ్ సెంటర్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ ధీరజ్, ప్రిన్సిపాల్ మురళీమోహన్, సెబ్ సీఐ విన్నీలత, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్, తేజమూర్తి, నిరంజన్‌రెడ్డి, మంజునాథ్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని వాటితో జీవితాలు నాశనం అవుతాయని సెబ్ సీఐ భార్గవ రెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు మధుసూదన్‌రావ్, మోహన్‌రెడ్డి, మంత్రాలయం సీఐ ఏరిషావలి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులతో సెబ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో వీవర్స్ కాలనీ నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. సోమప్ప సర్కిల్‌కు చేరుకుని విద్యార్థులచే మనవహారం ఏర్పాటుచేసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వారు మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలు కావడం వల్ల అనారోగ్యంతో పాటు శారీరకంగా, మానసికంగా కృశించి పోవడమే కాకుండా చట్టపరంగా నేరస్తులవుతారని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, పట్టణ ఎస్‌ఐ రమేష్‌బాబు, యాంటికరప్షన్ కమిటీ సభ్యులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోసిగి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోసిగి సెబ్ సీఐ మహబూబ్ బాషా, వైద్యుడు నిరంజన్ రెడ్డి సూచించారు. బుధవారం మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులచే పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, వైఎస్సార్ సర్కిల్ మీదుగా ర్యాలీ చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ సతీష్ కుమార్, సెబ్ ఎస్‌ఐ రమేష్‌బాబు, బాపురం చెక్‌పోస్ట్ సెబ్ ఎస్‌ఐ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కౌతాళం ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై విద్యార్థులతో మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయులు ఇమ్మాన్యుయల్, ఉపాధ్యాయుడు సుధాకర్ ప్రసంగించారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనర్థాలే ఎక్కువ

గోనెగండ్ల: మాదక ద్రవ్యాలతో అనర్థాలే ఎక్కువని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని సీఐ రామకృష్ణయ్య సూచించారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉండాలని సూచిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్‌తో పట్టుబడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదవుతాయని, నేరం రుజువైతే 20 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాల గురించి టోల్ ఫ్రీ నంబర్ 14500కు, లేదా తనకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాల సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందించాలి



సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని రూరల్: పెండింగ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలు, విద్యా కానుక కిట్లను తక్షణమే విద్యార్థులకు పంపిణీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లాధ్యక్షుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేయకుండా విద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్కూళ్ల ఆవరణలు వ్యర్థ పదార్థాలు, గడ్డితో నిండిపోయి ఉన్నాయని, తక్షణమే వాటిని తొలగించి శుభ్రం చేయాలన్నారు. పీడీఎస్‌యూ పట్టణ నాయకులు పవన్, సతీష్, రమేష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వీధి కుక్కల నుంచి ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. వీధి కుక్కలకు యాంటీర్యాబిస్ వ్యాక్సినేషన్ ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా కుక్కలను పట్టుకొని పబ్లిక్ హెల్త్ శాఖ వైద్యులు, సిబ్బంది వ్యాక్సిన్ వేసిన తర్వాత వాటిని వదిలిపెట్టారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వ్యాక్సిన్ వేయడం వల్ల కుక్కలకు ఎలాంటి హాని ఉండదని తెలిపారు. మున్సిపల్ డీఈలు మనోహర్ రెడ్డి, నీరజ, ఏఈ మదన్, శరత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ఆదోని నియోజకవర్గం అభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, అసోసియట్ అధ్యక్షుడు నాగేంద్రప్ప కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ..మున్సిపల్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఎస్టీయూ నాయకులు నరసింహులు, రవి, భీమరాజు, రాజ సతీష్, ఉరుకుందప్ప తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

ఆదోని అర్బన్: న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం స్థానిక బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే న్యాయవాదులతో సమావేశమయ్యారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. న్యాయవాదులు బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగేలా చూడాలన్నారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని గోవర్ధనగిరి చెరువు సమీపంలో బుధవారం అక్రమంగా గ్రావెల్ తవ్వుతుండగా పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జేసీబీతో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా పొలాలకు గ్రావెల్ తరలిస్తున్న విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ సిబ్బంది తవ్వకాలు జరుగుతున్న ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. పోలీసులు రావడంతో వాహనదారులు పరారయ్యారు. జేసీబీతో పాటు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ-2 మధుసూదన్‌రాజు

ఎమ్మిగనూరురూరల్: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఫీజులు వసూలు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారులు మధుసూదన్‌రాజు, ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వేర్వేరుగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆయా తరగతులకు వసూలు చేసే ఫీజు వివరాలను డిస్‌ప్లే చేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాహక్కు చట్టం ద్వారా ఎంపికైన విద్యార్థుల పట్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం అందించే పుస్తకాలతోనే విద్యాబోధన చేయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల రికార్డులు, హాజరుపట్టిక పకడ్బందీగా నిర్వహించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాట

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీకి ఆదాయ వనరులైన వివిధ మార్కెట్ల నిర్వహణకు సంబంధించి వేలం పాటలను గురువారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. మార్కెట్ల వేలం పాటల్లో పాల్గొనే వ్యాపారులు సాల్వెన్సీ, ధరావత్తు మొత్తం చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఝాన్సీ లక్ష్మీభాయి కూరగాయల మార్కెట్, పశువుల సంత, పశువుల మాంసపు అంగళ్లు, గొర్రెల సంత, గొర్రెల మాంసపు అంగళ్లు, కమేళాకు సంబంధించి బహిరంగ వేలం పాటలను మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనే కాంట్రాక్టర్లు గతంలో మున్సిపాలిటీకి ఎలాంటి బకాయిలు ఉండకూడదని తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

ఆదోని సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ఆరేకల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టిఏజి.సునీత బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయా గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్లను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆరేకల్ గురుకుల పాఠశాలల్లో మాత్రం 6వ తరగతిలో 1 సీటు (ఎస్టీ) మాత్రమే ఖాళీ ఉందన్నారు. 27, 28వ తేదీల్లో గురుకుల పాఠశాలలోనే దరఖాస్తు ఇస్తారని ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు పూర్తిచేసి ఇవ్వాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 29వ తేదీన ఆరేకల్ గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: పట్టణానికి చెందిన యువకుడిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు బుధవారం రాత్రి తెలిపారు. స్థానిక ఎద్దుల మార్కెట్ ప్రాంతానికి చెందిన కురవ వెంకటేష్ పట్టణంలో 8వ తరగతి చదువుతున్న మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి దేవరగట్టులో వరుణయాగం

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు వరుణయాగ పూజలు నిర్వహించనున్నట్లు సమ్మతగేరి తొప్పెట రామిరెడ్డి తెలిపారు. బెల్దోణ రామశాస్త్రీ ఆధ్వర్యంలో వరుణయాగ పూజలు జరుగుతాయని.. ఇందు కోసం ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ వరుణయాగం, కుంభోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఎమ్మిగనూరురూరల్: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తాలుకా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ఎన్నికల అధికారి ఈశ్వరయ్యస్వామి, పరిపాలన అధికారిణి అనసూయమ్మ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఆ కార్యవర్గ సభ్యుల ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీ పీఆర్‌ఎంఈఏ తాలుకా అధ్యక్షుడిగా ఎం.రాజానందం, ఉపాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ ఎస్.అబ్దుల్‌రహీమ్, ట్రెజరర్‌గా మోహన్‌రాజు, జాయింట్ సెక్రటరీ సి.మధుసూదన్, జిల్లా కౌన్సిల్-1 కె.నాగప్రసాద్, జిల్లా కౌన్సిల్-2 సి.కృష్ణమూర్తి, కో-ఆప్షన్ మెంబర్లుగా మేరిసూరాణి, మేరి శిరీషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన సభ్యులు పేర్కొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రామాంజనేయులు

నందవరం: బడి బయట పిల్లలను బడిలో చేర్పించేలా ఆయా పాఠశాల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ మండల విద్యాధికారి రామాంజనేయులు సూచించారు. బుధవారం స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి పంపించేలా చూడాలన్నారు. అలాగే మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శుభ్రత పాటించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఎంఈఓ-2 రఘునాథ్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కలుపు మొక్కల నివారణ ఇలా..

గోనెగండ్ల: సాగుచేసిన పంటల్లో కలుపు మొక్కల యాజమాన్యం తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ కలుపు మొక్కల వల్ల పైర్లకు దాదాపు 40 నుంచి 70 శాతం వరకు నష్టం కలుగుతుందన్నారు. కలుపు మొక్కలను సకాలంలో నివారించకపోతే పంట దిగుబడి మీద తీవ్ర ప్రభావం చూపుతుందని, ఆయా పైర్లలో కలుపు మొక్కల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, రసాయన మందులను ఎంత మోతాదులో వినియోగించాలో వివరించారు.

వివిధ పైర్లలో కలుపు యాజమాన్యం వివరాలు

వరి నారు నాటిన 3 నుంచి 5 రోజుల తర్వాత ఎకరానికి 35 గ్రాముల ఆక్సిడయార్జిల్, లేదా 400 మిల్లీలీటర్ల ప్రిటిలాక్లోర్, లేదా 100 గ్రాముల పైరజోసల్ఫ్యూరాన్ అనే కలుపు మందును 20 కిలోల ఇసుకలో కలుపుకొని పొలంలో చల్లి కొద్దిగా నీరు పెట్టాలి. 20 రోజుల తర్వాత బిస్ పైరిబాక్ సోడియం అనే కలుపు మందు 80 నుంచి 100 మిల్లీలీటర్లు, లేదా సైహలోఫాప్ బుటైల్ 300 నుంచి 400 మిల్లీలీటర్లు, లేదా 2, 4 డి సోడియం సాల్ట్ అనే కలుపు మందు 400 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

మొక్కజొన్న: మొక్కజొన్న నాటిన 48 గంటల్లో 800 గ్రాముల అట్రాజిన్ అనే కలుపు మందును 200 లీటర్లనీటిలో కలుపుకొనిపిచికారీ చేసుకోవాలి.

వేరుశనగ : వేరుశనగ పంట వేసిన 48 గంటల్లోపు పెండిమిథాలిన్ 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. తర్వాత 25 నుంచి 35 రోజులకు ఇమాజీత్ పైర్ అనే కలుపు మందు 300 మిల్లీలీటర్లు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. లేదా క్విజలో ఫాప్ ఇథైల్ అనే కలుపుమందు 400 మిల్లీలీటర్లు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.

పత్తి: పత్తి నాటిన 48 గంటల్లోపు పెండిమిథాలిన్ అనే కలుపు మందు 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. తర్వాత 35 నుంచి 40 రోజులకు క్విజలోఫాప్ ఇథైల్ అనే కలుపు మందు 400 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. ఇలా చేస్తే సాగుచేసిన పంటల్లో కలుపు మొక్కలు నశించి మంచి దిగుబడి వస్తుందని ఏడీఏ తెలిపారు.

మత్తుకు బానిసైతే జీవితం చిత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కుమారి అర్చన

ఆదోని రూరల్: కళాశాలలో చదివే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ కుమారి అర్చన సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి మన అలవాట్లే రేపటి మన భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. న్యాయవాదులు రామాంజనేయులు, ఈరన్న మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సీఐ విజయలక్ష్మి మాట్లాడుతూ.. నేటితరం పిల్లలు సిగరెట్‌తో మొదలుపెట్టి క్రమంగా దారి తప్పుతున్నారని, దీనివల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్, విద్యార్థులు పాల్గొన్నారు.